# నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలా!

**రోడ్డు విస్తరణలో ఇండ్ల కూల్చివేత**

**నష్టపరిహారం ఇవ్వాలని బాధితుల ఆందోళన**

**అధికారులతో వాగ్వాదం**

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 14: ఘట్‌కేసర్ పట్టణంలో నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా రోడ్డు విస్తరణ కోసం 25 దుకాణాలను కూల్చివేశారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారని కొంత మంది అడ్డుకునేందుకు యత్నించటంతో కొద్దిసేపు అధికారులతో వాగ్వాదం జరిగింది. షాపులు, ఇండ్లు కోల్పోతున్న బాధితులు మొత్తం 125 మంది ఉన్నారు. అందులోని 25 మంది గతంలో రెవెన్యూ అధికారుల వద్ద నుంచి డబ్బులు తీసుకున్నారు. మిగతా 100 మంది నిరాకరించటంతో వారి ఖాతాల్లోకి నేరుగా ప్రభుత్వం జమ చేసింది. తమకు ఇస్తున్న డబ్బులు మార్కెట్ ప్రకారం 1:3 రేషియోలో ఉండాలని సవాల్ చేస్తూ 12 మంది కోర్టును ఆశ్రయించారు. కాగా ఇటీవల బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని పట్టణ జేఏసీ ఆధ్వర్యంలో రిలేనిరాహార దీక్షలకు దిగటంతో రంగంలోకి దిగిన ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్ ప్రభుత్వ పెద్దలతో సంప్రదించి పనులను పునరుద్ధరింపజేశారు. కాగా రోడ్డు విస్తరణ జరగకపోవటం వల్ల పనులకు అంతరాయం కలగటంతో పాటు పట్టణంలోనికి జిల్లా ఆర్టీసీ బస్సులు రాకపోవటంతో అధికారులపై ఒత్తిడి పెంచారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు మూడు రోజులుగా స్వాధీనం చేసుకునే స్థలానికి మార్కింగ్ చేశారు. శనివారం ఉదయం నుంచి గతంలో డబ్బులు తీసుకున్న 25 మందికి చెందిన వాణిజ్య సముదాయాలను కూల్చివేస్తుండగా కొంతమంది స్వచ్ఛందంగా కూల్చివేతలు జరుపుకున్నారు. మిగతా బాధితులు తమకు పూర్తి న్యాయం జరిగిన తర్వాతనే కూల్చివేతలు జరపాలని అడ్డుకున్నారు. అనంతరం రిలే నిరాహార దీక్ష వద్దకు వెళ్లి తమకు నష్ట పరిహారం ఏదని ప్రశ్నించారు. దీక్షకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన కోదండరాం అతి త్వరలో సమస్యకు పరిష్కారం తీసుకువస్తానని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.



ఘట్‌కేసర్ పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డా.శరత్ చంద్ర

## 17 నుంచి పశువైద్య జాతీయ సదస్సు

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 14: మూడు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సులో పశువైద్యంపై సుదీర్ఘ చర్చ జరుగనున్నదని, పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా.శరత్ చంద్ర అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ వెటర్నరీ సమావేశపు హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17 నుంచి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. 33వ నేషనల్ కాంగ్రెస్ నేషనల్ సింపోజియం ఆఫ్ పారాసిటాలజీ అనే అంశంపై సుదీర్ఘ చర్చ జరుగనున్నదన్నారు. జంతు, పరాన్నజీవుల నియంత్రణ, వ్యూహాలలో చేసిన మార్పులు, నూతన ఆవిష్కరణలు పెద్ద ఎత్తున జరగనున్నాయన్నారు. అసోసియేట్ డీన్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ వెటర్నరీ నిపుణులు, డాక్టర్ల మధ్య సహకారాన్ని ప్రోత్సహించేందుకు ఈ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డా.సత్యనారాయణ రాజు,డా.సురేశ్, విజయ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ రాధా గోవింద రథయాత్ర

బంజారాహిల్స్,డిసెంబర్ 14: సాంస్కృతిక వైభవంతో పాటు ఆధ్యాత్మికత, సమైక్యత సమ్మేళనంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో కోకాపేటలో శ్రీ రాధా గోవింద రథయాత్రను ఘనంగా నిర్వహించారు. సుందరంగా అలంకరించిన రథంపై శ్రీ రాధా గోవిందులు ఆసీనులు కాగా వందలాది మంది భక్తులు రథాన్ని లాగుతూ సందడి చేశారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు సత్యచంద్ర గౌరదాస, హరే కృష్ణ మూవ్‌మెంట్ చెన్నై అధ్యక్షుడు స్థోక కృష్ణ మహారాజ్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప కన్‌స్ట్రక్షన్స్ మరోసారి నిర్లక్ష్యం

**సీవరేజీ పనుల్లో తాగునీటి పైప్‌లైన్‌కు గండి**

**నేడు నీటి సరఫరాలో అంతరాయం**

**ఏజెన్సీపై చర్యలు తీసుకోని జల మండలి**

సిటీబ్యూరో, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ): కోట్లాది రూపాయల సీవరేజీ పనులు దక్కించుకున్న అయ్యప్ప కన్‌స్ట్రక్షన్స్ మరో సారి నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించింది. గతంలో ముగ్గురు అమాయక కార్మికులను పొట్టన పెట్టుకున్న సదరు ఏజెన్సీ తాజాగా సీవరేజీ పైపులైను పనుల్లో భాగంగా తాగునీటి పైపులైనుకు గండి కొట్టింది. శనివారం ఆసీఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్ నుంచి రెడ్‌హిల్స్‌కు వచ్చే తాగునీటి పైపులైను (900 ఎంఎం డయా)కు తూట్లు పొడిచింది. ఫలితంగా 20వేల నల్లా కనెక్షన్‌దారుల తాగునీటి గోసకు కారణమైంది. ఫలితంగా రెడ్‌హిల్స్ బజార్‌ఘాట్, మల్లేపల్లి, సీతారాంబాగ్, నాంపల్లి రైల్వే స్టేషన్, నిలోఫర్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి, యూసుఫైన్ దర్గా ప్రాంతం, ఏక్ మినార్, సుభాన్, గన్‌ఫౌండ్రీలోని కొంత భాగం, ఆదర్శ్‌నగర్, బీజేఆర్‌నగర్, ఖైరతాబాద్ డబుల్ బెడ్రూం, మింట్ కాంపౌండ్, ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్, ఏసీ గార్డ్స్, ఇన్‌కమ్ ట్యాక్స్ కాలనీ, విజయ్‌నగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో ఆదివారం నీటి సరఫరా నిలిచిపోనున్నది. గతంలో సదరు అయ్యప్ప కన్‌స్ట్రక్షన్ బాధ్యులు ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించక పోవడంతో ముగ్గురు కార్మికులు చనిపోయారు. తాజాగా పైపులైను పనులు నడుస్తున్నప్పుడు మళ్లీ అజాగ్రత్తగా వ్యవహరించడంతో అమాయక ప్రజలు నీటి గోస పడాల్సి వస్తుంది. కానీ ఈ సమస్యకు బాధ్యులైన అయ్యప్ప ఏజెన్సీతో పాటు ప్రాజెక్టు డివిజన్-8 అధికారులపై జలమండలి ఏ మాత్రం చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

## టీ హబ్ వేదికగా హెల్త్ కేర్ సమ్మిట్

సిటీబ్యూరో, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ): హెల్త్‌కేర్ రంగంలో ఆవిష్కరణలకు డిమాండ్ ఉందని పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు. శనివారం టీ హబ్ వేదికగా జరిగిన హెల్త్ కేర్ సమ్మిట్‌కు దేశంలోని పారిశ్రామిక, పరిశోధన, శాస్త్రీయ, హెల్త్, ఆవిష్కర్తలను టీ హబ్ నిర్వాహకులు ఆహ్వానించారు. 350 మంది ప్రతినిధులు పాల్గొనగా 11 సెషన్లలో 40 మంది వక్తలతో చర్చాగోష్ఠి నిర్వహించారు. నాలుగో ఎడిషన్ హెల్త్ కేర్ సమ్మిట్‌లో భాగంగా ఆరోగ్య సంరక్షణ, ఆరోగ్యం-సాంకేతిక నైపుణ్యంతోపాటు భవిష్యత్‌లో వచ్చే సాంకేతికతల పరివర్తనలపై సమీక్షించారు. ఆరోగ్య సంరక్షణలో ఎదురవుతున్న వైఫల్యాలను తొలగించడం, టెలిమెడిసిన్, టెలిఐసీయూ, ఇంటర్ హాస్పిటల్ సహకారం, డిజిటల్ థెరప్యూటిక్స్‌లో ఫార్మా పాత్ర, డిజిటల్ నర్సింగ్ ద్వారా రోగి సంరక్షణ, వెల్‌నెస్, న్యూట్రాస్యూటికల్స్, డయాగ్నోస్టిక్స్‌లో ఏఐ, రిమోట్ మానిటరింగ్, స్టార్టప్‌ల వైఫల్యం, బ్రాండింగ్‌లో ఏఐ ప్రాధాన్యత వంటి అంశాలపై నిపుణులు అభిప్రాయాలను వ్యక్తం చేశారు.



సభలో అభివాదం చేస్తున్న ప్రొఫెసర్లు జ్ఞాన అలోషియస్, జయధీర్ తిరుమల రావు, సీనియర్ సంపాదకుడు శ్రీనివాస్, విమలక్క

## ఏసీఎఫ్ 50 వసంతాల సభ

చిక్కడపల్లి,డిసెంబర్14 : సామ్రాజ్యవాద యుద్ధ సంస్కృతిపై ఐక్య ఉద్యమాలు చేయాలని పలువురు వక్తలు అన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య(ఏసీఎఫ్) 50 వసంతాల బహిరంగ సభను శనివారం బాగ్‌లింగంపల్లి వీఎస్‌టీ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ జ్ఞాన అలోషియస్ మాట్లాడుతూ గ్రామల్లో యువతలో మతతత్వం రోజురోజుకు పెరిగిపోతుందని అన్నారు. మంచి మార్గంలో సమాజం ముందుకు సాగేటట్టు కళాకారులు చొరవ చూపాలన్నారు. అరుణోదయ ఉభయ రాష్ర్టాల గౌరవ అధ్యక్షురాలు విమలక్క అధ్యక్షత జరిగిన సభలో సీనియర్ సంపాదకులు శ్రీనివాస్, ప్రొఫెసర్ జయధీర్ తిరుమల రావు, ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు, కట్ట భగవంత రెడ్డి, ప్రొఫెసర్ కొల్లాపురం విమల,మనోజ, తెలంగాణ ఏపీ రైతు కూలీ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు కర్నాకులా వీరాంజనేయులు, పటోళ్ల నాగిరెడ్డి, పీవోడబ్ల్యూ, సుజ్ఞానమ్మ, అరుణ, అల్లూరి విజయ్ పీడీఎస్‌యూ సతీశ్, తెలంగాణ కార్యదర్శి మల్సూర్, ఏపీ అధ్యక్షుడు బోయ సుంకులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





# ఉల్లాసంగా రాక్‌బే నేచర్ క్యాంప్

సిటీబ్యూరో, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చిలుకూరు రిజర్వ్ ఫారెస్ట్‌లోని మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో రెండురోజుల పాటు జరిగిన రాక్‌బేనేచర్ క్యాంప్ విద్యార్థినీ విద్యార్థులకు మధురానుభూతిని మిగిల్చింది. శుక్రవారం మధ్యాహ్నం మొదలైన క్యాంప్ శనివారం సాయంత్రం వరకు జరిగింది. డెక్కన్ ఉడ్ అండ్ ట్రైల్స్ పేరిట జరిగిన ఈ క్యాంప్‌లో మంచిర్యాల జిల్లా నస్పూర్ రేడియంట్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఎకోటూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ మాట్లాడుతూ ప్రకృతితో మమేకమయ్యేలా విద్యార్థులకు ప్రకృతి ప్రాధాన్యాన్ని తెలిపేలా ఈ క్యాంప్‌ను నిర్వహిస్తున్నామన్నారు. రాక్‌బే నేచర్ క్యాంప్‌లో ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ తనూజ, ఎఫ్‌ఆర్‌ఓ లక్ష్మారెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ సుమన్, హెడ్ నేచరలిస్ట్ అఖిల్, అపరంజిని, వండరింగ్ బి హాలీడేస్ తరపున రాఘవేంద్రప్రసాద్, సతీశ్, వంశీ, బాబు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన కవి, రచయిత డా. నందిని సిధారెడ్డిని అల్వాల్‌లోని ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు బాల్క సుమన్, దేవీప్రసాద్, దాసోజు శ్రవణ్ తదితరులు ఉన్నారు.

# జీవో 317ను సవరించాలి

**ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ నాయకులు**

చిక్కడపల్లి, డిసెంబర్ 14: అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి జీవో 317ను సవరించి ఉద్యోగ, ఉపాధ్యాయులను తమ స్థానిక జిల్లాలు, జోన్లకు కేటాయించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో 317 జీవో వలన స్థానికత కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయ స్థానికత సాధనకు శనివారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద మహా నిరాహార దీక్ష చేపట్టారు. చైర్మన్ విజయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, కన్వీనర్ మధుసూన్ రెడ్డి మాట్లాడుతూ ఈ జీవో పై ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. స్థానిక అంశమే లేకుండా మూడు జీవోలు రావడం పై స్థానికత కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయలను తీవ్ర నిరాశకు గురయ్యారని తెలిపారు. జీవోను వెంటనే సవరించి న్యాయం చేయాలని కోరారు. నాయకులు సందీప్, మల్లేశ్, రమేశ్, రేష్మ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు



ప్రియాంక వర్గీస్‌ను సన్మానిస్తున్న విద్యార్థినులు

## తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగాలి

హయత్‌నగర్, డిసెంబర్ 14 : విద్యార్థులు తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగాలని తెలంగాణ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ ప్రియాంక వర్గీస్ అన్నారు. ఎల్బీనగర్‌లోని టీజీఎస్ డబ్ల్యూఆర్‌డీసీ న్యాయ కళాశాలలో కామన్ డైట్ మెనూను ప్రియాంక వర్గీస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మాయి చదువుకుంటే కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు. విద్యార్థినులు న్యాయవాద వృత్తిలో అత్యున్నత స్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సాధించగలరని కొనియాడారు. ప్రధానంగా చివరి సంవత్సరంలో విద్యార్థులు బాధ్యతాయుతంగా ఉండాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సహకార బ్యాంకులను బలోపేతం చేయాలి

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ రంగానికి, ప్రభుత్వానికి వారధిగా ఉన్న సహకార బ్యాంకులను బలోపేతం చేయడానికి ప్రభుత్వం తగిన నిర్ణయాలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. హైదరాబాద్‌లోని కాచిగూడ మ్యాడం అంజయ్య భవన్‌లో శనివారం జరిగిన తెలంగాణ సహకార సెంట్రల్ బ్యాంకుల ఉద్యోగుల అసోసియేషన్ 4వ రాష్ట్ర మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సహకార బ్యాంకు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రెండంచెల వ్యవస్థను అమలు చేయాలనే ఉద్యోగుల డిమాండ్ న్యాయమైనదని ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలని అన్నారు. వేతనాల్లో అసమానతలు తగదని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు, ఇతర సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం నేతలు మార్నేని రవీందర్‌రావు, బీఎస్ రాంబాబు, కొండూరు రవీందర్, కుంభం శ్రీనివాస్, కేవీఎస్ రవికుమార్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## పునరుత్పాదక శక్తిపై సెమినార్



జ్ఞాపికను అందజేస్తున్న బిట్స్ పిలానీ డీన్ యోగీశ్వరీ

జవహర్‌నగర్, డిసెంబర్ 14: బిట్స్ పిలానీ క్యాంపస్, తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ హైదరాబాద్ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఎక్సలెన్స్ ఇన్ నేషనల్ సెక్యూరిటీ(క్రెన్స్) సహకారంతో పునరుత్పాదక శక్తిపై బిట్స్ పిలానీలో శనివారం సెమినార్ నిర్వహించారు. హైదరాబాద్‌లోని పలు ఉన్నత పాఠశాలలకు చెందిన అధ్యాపకులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రీన్ ఎనర్జీ సెంటర్ ఎడ్, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డాక్టర్ మధు చంద్రిక ఛటోపాధ్యాయ హాజరయ్యారు. ఈ సందర్భంగా బిట్స్ పిలానీ డీన్ యోగీశ్వరీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల ద్వారా పునరుత్పాదక ఇంధన వనరులపై సమాచారాన్ని విద్యార్థులకు నేరుగా అందించేందుకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సుహార్వేశ్, శబరీశ్ జీఆర్, పరమేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

శేరిలింగంపల్లి, డిసెంబర్ 14: మారుతున్న కాలానుగుణంగా టెక్నాలజీని అందిపుచ్చుకొని ఐటీ రంగంలో సేవలు విస్తృత పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లో 'టెక్‌వేవ్ కన్సల్టింగ్' నూతన కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు.



## అల్లం నారాయణ జన్మదిన వేడుకలు

సిటీబ్యూరో, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : టీయూడబ్ల్యూజే 143 వ్యవస్థాపక అధ్యక్షుడు తెలంగాణ మీడియా అకాడమీ తొలి చైర్మన్ అల్లం నారాయణ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీసాగర్, రాష్ట్ర కార్యదర్శి గుండు గుత్తయ్య గౌడ్, నాయకులు రమేశ్ హజారీ, వర్దెల్లి వెంకన్న, శేఖర్ సాగర్, బొమ్మ అమరేందర్, మురళీ యాదవ్ తదితరులు అల్లం నారాయణకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## లింగంపల్లికి ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు

సిటీబ్యూరో, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : ఎన్జీవోస్ కాలనీ నుంచి లింగంపల్లి రూట్‌లో న్యూ గ్రీన్ ఎలక్ట్రిక్ మెట్రో లగ్జరీ ఏసీ బస్సులను ప్రవేశపెడుతున్నట్టు గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. బీఎన్ రెడ్డి నగర్, సాగర్ రింగ్ రోడ్డు, మందమల్లమ్మ, ఆరాంఘర్, దర్గా, ఖాజాగూడ, నానక్‌రాం గూడ, విప్రో సర్కిల్, వేవ్ రాక్, ఐఐఐటీ ఎక్స్ రోడ్ మార్గాల్లో ఎలక్ట్రిక్ బస్సు సేవలు సోమవారం నుంచి అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

## ఎయిర్ పోర్టుకు ఏసీ పుష్పక్ బస్సులు

మియాపూర్ , డిసెంబరు 14 : లింగంపల్లి నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు ఏసీ పుష్పక్ బస్సు సర్వీసులను ఆదివారం ప్రత్యేకంగా నడిపిస్తున్నట్లు ఆర్టీసీ మియాపూర్ డిపో 2 డీఎం వెంకటేశం శనివారం తెలిపారు. ఈ బస్సు లింగంపల్లి , చందానగర్, ఆల్విన్ క్రాస్ రోడ్డు, హఫీజ్‌పేట్, కొండాపూర్, కొత్తగూడ, గచ్చిబౌలి మీదుగా ఎయిర్ పోర్టుకు చేరుతుందన్నారు. ప్రతి రోజు ఉదయం 5.45 మొదటి బస్సు సర్వీసు ప్రారంభమైన రాత్రి 10.45 చివరి బస్సును ఆపరేట్ చేయనున్నట్లు డీఎం వెంకటేశం తెలిపారు. ఏయిర్ పోర్టు నుంచి లింగంపల్లికి ప్రతి ఉదయం 7.30 గంటలకు మొదటి బస్సు ప్రారంభమైన రాత్రి 10.30 చివరి బస్సు సర్వీసు ఉంటుందన్నారు.

## గ్రూప్ 2 పరీక్ష కేంద్రాలకు ఆర్టీసీ బస్సులు

కాచిగూడ, డిసెంబర్ 14: ఆది, సోమ నిర్వహించనున్న గ్రూప్ 2 పరీక్ష రాయబోయే విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని 101 పరీక్ష సెంటర్లకు 106 ఆర్టీసీ బస్సులను నడుపనున్నుట్లు కాచిగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ రఘు తెలిపారు. శనివారం డిపోలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాచిగూడ బస్‌స్టేషన్ నుంచి నగరంలోని అన్ని పరీక్ష సెంటర్లకు బస్సులను నడుపనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## శబరిమలకు 36 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం మరో 36 ప్రత్యేక రైళ్లను నడపనున్నామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం వెల్లడించారు. ఈ నెల 19 నుంచి జనవరి 24 వరకు సికింద్రాబాద్-కొల్లం, కాకినాడ పోర్టు-కొల్లం, విజయవాడ-కొల్లం, గుంటూరు-కొల్లం, నర్సాపూర్-కొల్లం, స్టేషన్ల మధ్య రైళ్లు నడుస్తాయని తెలిపారు.



## డీ సన్స్ పటోలా ఆర్ట్ వస్త్ర ప్రదర్శన ప్రారంభం

సిటీబ్యూరో, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): బంజారాహిల్స్ రోడ్ నం.1లోని లేబుల్స్ పాప్ ఆప్ స్పేస్‌లో ఏర్పాటు చేసిన డీ సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శనను పద్మశ్రీ అవార్డు గ్రహీత, భారతీయ కూచిపూడి నృత్యకారిణి డాక్టర్ పద్మజా రెడ్డి, నిర్వాహకుడు భవిన్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. విభిన్నమైన హ్యాండ్లూమ్ చీరలతో పాటు పటోలా ఆర్ట్స్ చీరలు, సిల్క్ వస్త్రోత్పత్తులు ఒకే వేదికలో ప్రదర్శించడం అభినందనీయమన్నారు. చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు ఇలాంటి ప్రదర్శనలు దోహదపడుతాయన్నారు.